ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 02 | ఏప్రిల్ | 2024
పేజీలు 7

తరగతి గదుల్లో సెల్ ఫోన్లు..!

వాహనాలతో
హైవే రోడ్డు ధ్వంసం..!

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లోపలి పేజీల్లో

# రణమా..శరణమా..!

**-తేల్చుకోలేకపోతున్న బిఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం**
**-జారుకుంటున్న సీనియర్లు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత రాష్ట్ర సమితి ద్వితీయ శ్రేణి నాయకత్వం సందిగ్ధ అవస్థలో ఉంది. బిఆర్ఎస్‌లోనే ఉండి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిలబడటమా లేక ఎదురీత ఎందుకులే అని కాంగ్రెస్‌లో చేరిపోవడమా అనేది తేల్చుకోలేకపోతున్నారు. దశాబ్ద కాలంగా పదవులు అనుభవించిన వారు మాత్రం ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిపోయారు. మిగిలిన వారు ప్రజల్లోకి రావడం లేదు. గ్రామాల్లో కాంగ్రెస్ హవా నడుస్తుంది. బిఆర్ఎస్‌లో కొనసాగితే భవిష్యత్తు వచ్చే స్థానిక ఎన్నికలకు క్యాడర్‌ను కాపాడుకోవడం ఎలా అన్న మీ మాంసలో ఉన్నారు. రాష్ట్రంలో అధికారం చేతులు మారిన తర్వాత బిఆర్ఎస్ కాకవికలమవుతుంది. పదవులు అనుభవించిన వారు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు అభివృద్ధి జపం చేస్తూ అధికార పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు వారి వెంట తిరిగిన ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఎక్కువ మంది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు. పార్టీ మారితే కాంగ్రెస్‌లో అవకాశం కల్పిస్తారా, కల్పించక పోతే పరిస్థితి ఏమిటి అన్న ఆలోచనలో ఉన్నారు. ఒక స్థాయి నాయకులు పార్టీ మారినా అంత తేలికగా ఉండదు. గ్రామ, మండల నాయకుల పరిస్థితి ప్రతి గ్రామంలోను రెండు మూడు పార్టీలు తప్పని సరిగా ఉంటాయి. ఆ పార్టీల మధ్య పోటీ కూడా తప్పని సరి. ఒకవేళ ఒకే పార్టీ ఉంటే రెండు మూడు గ్రూపులు ఉండడం సహజమే. ఇటువంటి పరిస్థితులలో స్థానిక సంస్థల్లో తమ సత్తా చాటాలనుకునే వారు పార్టీ మార్పుపై అంతగా ఆసక్తి కనిపించడం లేదు కాకపోతే క్యాడర్ ను కాపాడుకోవడం ఎలా అన్న ప్రశ్న తలెత్తినప్పుడు కొంత ఆందోళనకు గురవుతున్నారు. ఇక పార్టీ మారుతున్న ఎంఎల్ఏలు, మాజీలు తమ వెంట క్యాడర్ ను తీసుకు పోకుండా పార్టీ మారితే విలువ ఉండదన్న భావనలో ఉన్నారు. ఇప్పటి వరకు తమ వెంట ఉన్న వారిని పార్టీని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు నిన్న మొన్నటి వరకు అండగా ఉన్న నేతల పార్టీ మార్పు ఒత్తిడి ఒకవైపు అయితే స్థానికంగా పార్టీలోనే కొనసాగాలన్న ఒత్తిడి నడుమ రణమో, శరణమో తేల్చుకోలేక ద్వితీయ శ్రేణి బిఆర్ఎస్ నాయకత్వం సతమతమవుతుంది.



# పెద్దిపల్లి ఇసుక క్వారీకి ప్రత్యేక చట్టాలా..!?



**-హద్దులు ఓ చోట.. ఇసుక తోడేది మరో చోట**
**-నిబంధనలకు తిలోదకాలు.. ప్రశ్నిస్తే దాడులు**
**-గిరిజనులకు ఉపాధి ఊసేది**

**ప్రజాపక్షం/ చర్ల :** తెలంగాణ రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ నిబంధన చర్ల మండల పరిధిలోని పెద్దిపల్లి ఇసుక క్వారీకి వర్తించే పరిస్థితి లేదు. పేరుకే గిరిజన సొసైటీ ద్వారా ఇసుక తరలింపు. కానీ పెత్తనమంతా మైదాన ప్రాంతానికి చెందిన ఇసుక కాంట్రాక్టర్లదే. ఇక్కడ ఏ ప్రభుత్వ నిబంధన పని చేయదు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతూ పెద్దిపల్లి ఇసుక క్వారీని ఒక నిషిద్ధ ప్రాంతంగా మార్చివేశారు. ఇక్కడ జరుగుతున్న కొంత మంది బినామీ ఇసుక కాంట్రాక్టర్లు హల్‌చల్ చేస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన చోట కాకుండా మరో చోట ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. నిర్దేశించిన లోతు కన్న అధికంగా ఇసుకను తోడుతున్నారు. పెద్దిపల్లి మహిళా ట్రైబల్ శాండ్ క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట ఒక క్వారీని ఏర్పాటు చేసి నడుపుతున్నారు. 2 జూన్ 2023 నుంచి 1 జూన్

మిగతా 2లో..

# అడ్డగోలుగా ఇటుక బట్టీలు..!



**-విద్యుత్ చౌర్యం చేస్తున్న బట్టీదారులు**
**-కార్మికశాఖ అనుమతులు ఎక్కడ**

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీ దేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి, కారుకొండ, లోతువాగు, హేమచంద్రాపురం, జూబ్లిపురం గ్రామాల్లో ఇటుక బట్టీల దందా జోరుగా కొనసాగుతుంది. 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ ఇటుక బట్టి యజమానులు చట్టాలను తుంగలో తొక్కి బట్టీల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఈ బట్టీల వలన ప్రశాంతంగా ఉన్న పల్లె వాతావరణం కలుషితం అవుతున్నాయి. ఇటుకలను తయారు చేసిన పిదప వాటిని కాల్చుటకు ఉపయోగించే కలపను అతి చెరువులో ఉన్న అడవుల నుండి సమకూర్చుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు బట్టీదారులకు మిళితమై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటుక తయారీ కూలీలను ఇతర రాష్ట్రాల నుండి తీసుకొస్తున్నారు. సంబంధిత కార్మికశాఖ అధికారుల

మిగతా 2లో..

# పెద్దిపల్లి ఇసుక క్వారీకి ప్రత్యేక చట్టాలా..!?











(మొదటిపేజీ తరువాయి)
2024 వరకు టిఎస్ఎండిసి జనరల్ మేనేజర్ ఈ సొసైటీతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించాడు. పెద్దిపల్లి గోదావరిలో 24.96 ఎకరాలలో 179702 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను నిబంధనల ప్రకారం తీయాల్సి ఉంది. ఈ ఇసుక తరలింపు ద్వారా గిరిజన యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ఈ ఇసుక క్వారీ సభ్యులకు కూడా ఆర్థికంగా చేయూతనిచ్చేవిధంగా ఇసుక తరలింపు జరగాల్సి ఉంది. అయితే ఇక్కడ మైదాన ప్రాంతం నుంచి ఓ బినామీ కాంట్రాక్టర్ ప్రభుత్వ నిబంధనలకు, సొసైటీ నియమావళికి విరుద్ధంగా ఇసుక తరలింపు చేస్తున్నారని మిషన్లను ఉపయోగించడం ద్వారా తాము ఉపాధి కోల్పోతున్నామని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమార్కులకు అధికారుల అండ పుష్కలంగా ఉందని హైదరాబాద్, కొత్తగూడెంలకు చెందిన బినామీ కాంట్రాక్టర్లు అధికారుల అండతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ ఇసుక అక్రమాన్ని వెలికితీసే క్రమంలో కొందరు జర్నలిస్టులపై కూడా బినామీ కాంట్రాక్టర్లు దాడులకు పాల్పడడంతో ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు ఈ క్వారీపై దృష్టిసారించి ఈ బినామీ వ్యవస్థను రద్దు చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

# సారూ.. మనోవర్తి ఇప్పించండి

**ప్రజాపక్షం/ వైరా :** వృద్ధాప్యంలో మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాకు కోడలి నుంచి రావాల్సిన మనోవర్తి ఇప్పించండి. చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో అధికారులు చెప్పిన రీతిగా మనోవర్తి ఇప్పించాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన షేక్ ఖాసిం సాహెబ్, షేక్ ముంతాజ్‌కు ముగ్గురు కుమారులు. ఇందులో పెద్ద కుమారుడు షేక్ జాన్‌పాషా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ 2008లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన మరణించడంతో ఆయన భార్యకు ఉద్యోగం ఇచ్చే సమయంలో వృద్ధ దంపతులకు మనోవర్తి ఇప్పించాలని అధికారులు ఆదేశించారు. కానీ అది ఈరోజుకు కూడా అమలు కాలేదు. కోడలు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ వృద్ధ దంపతులను అసలు పట్టించుకోడం లేదు. ఇటీవల వరకు టైలర్‌గా పని చేస్తూ ఖాసింసాహెబ్ తన కుటుంబాన్ని పోషించాడు. కానీ ఇప్పుడు వయస్సు మీదపడడంతో టైలరింగ్ చేయలేని పరిస్థితి ఏర్పడింది. కోడలు ద్వారా మనోవర్తి ఇప్పించాలని రాష్ట్ర స్థాయి అధికారుల వరకు పలువురికి మోరపెట్టుకున్న ఎవరు స్పందించ లేదు. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే సమయంలో అప్పటి ఖమ్మం ఆర్డీవో అత్త, మామలకు



మనోవర్తి ఇచ్చేవిధంగా ఒప్పంద పత్రం పై కూడా సంతకాలు చేయించారు. కానీ ఈ రోజు వరకు అది అమలు కాలేదు. వృద్ధ దంపతులకు మనోవర్తి ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఖాసిం సాహెబ్ పట్ల మానవతా ధృక్పథంతో వ్యవహరించి అధికారులు మనోవర్తి కోడలు నుంచి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నేరళ్ల

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నేరళ్ల శ్రీనివాసరావు భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. గత నెల 28న జరిగిన బార్ అసోసియేషన్ ఓట్ల లెక్కింపు సోమవారం జరిగింది. మొత్తం 946 ఓట్లకు గాను 757 ఓట్లు పోలయ్యాయి. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు లెక్కించగా నేరళ్ల శ్రీనివాసరావుకు 522 ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థి కన్నెబోయిన నాగేశ్వరరావుకు 170 ఓట్లు పోలయ్యాయి. 352 ఓట్ల మెజార్టీతో శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రధాన బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా చింతనిప్పు వెంకటేశ్వరరావు ఆయన సమీప ప్రత్యర్థి పై 289 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కన్నెగంటి గోపి గ్రంథాలయ కార్యదర్శిగా 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా కె. ఉపేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా కె. వెంకటేశ్వరరావు, కోశాధికారిగా యజ్ఞగాని శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత లు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విధితమే. కొత్తగా ఎన్నికైన వారు న్యాయాధికారులను కలిశారు. సోమవారం





సాయంత్రం కొత్తగా ఎన్నికైన వారిచే ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్ రాజు, రాయల పావెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి ఎన్నిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం ప్రకటించారు.

# అడ్డగోలుగా ఇటుక బట్టీలు..!



(మొదటిపేజీ తరువాయి)
నుండి ఎటువంటి అనుమతులు సైతం తీసుకోవడం లేదు. వీరు ఇటుకలు తయారు చేసే ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సైతం అడ్డాలుగా మార్చుకొని బట్టీలకు ఉపయోగించే కలపను ఆ పాఠశాలల ఎదుటే నిల్వ చేస్తున్నారు. గత కొన్నేళ్ళ నుండి సాగుతున్న ఈ దందాను అడ్డుకునే అధికారులే లేకపోవడం గమనార్హం. బట్టీల వద్ద వినియోగించే విద్యుత్‌ను సైతం చౌర్యం చూస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటివరకు బట్టీదారులు వినియోగించే విద్యుత్‌కు జరిమానాలు సైతం విధించకపోవడం వెనుక ఆంతర్యమేమిటి. సారవంతమైన వ్యవసాయ భూములను ఇటుక బట్టీలకు వినియోగించడం వలన పంటలు సైతం పండక ఎంతోమంది రైతులు గగ్గోళ్ళు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకొని అడ్డగోలుగా వెలుస్తున్న ఇటుక బట్టీలను నియంత్రించాలని కొంతమంది ప్రజలు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 153 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సత్తుపల్లి మండలం గంగారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, తల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం ఉండేవిధంగా రైతులు చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధికారులు, సిఈవోలు, ఏఈవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

**ప్రజాపక్షం/ మధిర :** పెరుగుతున్న ధరలకనుగుణంగా మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మధిర మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం మధిరమున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పని చేస్తున్న కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, అతితక్కువ వేతనాలు, పెరుగుతున్న నిత్యావసర ధరల వలన కార్మిక కుటుంబాలు బ్రతుకు భారమై అప్పులపాలవుతున్నారన్నారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి కనీస వేతనం, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటీయూసి మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు చటారి నాగేంద్రం, పుల్లూరి నరేష్, గద్దల శ్రీకాంత్, చటారికుమార్, ఎంద్రవల్లి చిన్న, చిలివేరు సురేష్, గడ్డం మారతమ్మ, రుద్రారపు నాగమ్మ, గద్దల కుమారి, లక్ష్మీ, కనకపూడి అనూ తదితరులు పాల్గొన్నారు.





# బిఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే కరువు




-ప్రాజెక్టులు, ఖజానా ఖాళీ చేసిన ఘనత బిఆర్ఎస్‌దే..
-మీడియా సమావేశంలో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ల

**ప్రజాపక్షం/ఖమ్మం:** బిఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే ఇప్పుడు తెలంగాణలో కరువు అలుముకుంటుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ తప్పుగా భావించి విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ రాష్ట్ర ఖజానా తో పాటు ప్రాజెక్టులలోని నీటిని సైతం ఖాళీ చేసిందని మొదటి పంటకే నాగార్జున సాగర్ ద్వారా నీళ్లు ఇవ్వలేని బిఆర్ఎస్ రెండవ పంటకు నీళ్లు ఇవ్వలేదని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. కేవలం పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమ ఉనికిని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఇప్పుడు బిఆర్ఎస్ నేతల మాటలు ప్రజలను నమ్మే స్థితిలో లేరన్నారు. తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని వారి మధ్య చిచ్చుపెట్టే ప్రసంగాలు మానుకోవాలని దుర్గా ప్రసాద్ హితవు పలికారు. బిఆర్ఎస్ హయాంలో కృష్ణా నది జలాలను ఆంధ్రాకు తరలించుకు పోతున్నా ఎందుకు స్పందించ లేదని ఆయన ప్రశ్నించారు. కృష్ణానది పరివాహక ప్రాంత ప్రాజెక్టులపై దృష్టి సారించకుండా డబ్బుల కోసం కాళేశ్వరం పై మాత్రమే దృష్టి సారించారని ఆయన ఆరోపించారు. వాస్తవాలకు అనుగుణంగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడితే మంచిదని ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం అడ్డగోలు మాటలు సరి కావన్నారు. మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్, పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పెంద్ర అంజయ్య పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో సత్యాల కోటయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....రైతులకు మద్దు ధర ను అందించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి మద్ధతు ధర ను పొందాలని కోరారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ. 2203, కామన్ రకం క్వింటా రూ. 2183 లను అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించ కుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసమే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఇంచార్జీ చప్పిడి వీరబాబు, రైతులు బండి నాగలింగేశ్వరరావు, దేవరాజ్, వెంకన్న, నరసింమారావు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్‌బిఐటిలో ముగిసిన ఐడియాతాన్ వర్క్‌షాప్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రస్తుతం చేసే ఆలోచనలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఐడియాతాన్ వర్క్‌షాప్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న తరం పూర్తిగా మానవ మేధస్సు పైనే ఆధారమై ఉందని, వినూత్న ఆలోచనలు చేయనిదే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ఆర్‌డివో వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యకలాపాలకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలకు కార్యరూపం ఇచ్చారన్నారు. మొత్తంగా 47 కొత్త ఆలోచనలను ప్రదర్శించగా ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను అందజేసినట్లు వారు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి వర్క్‌షాపులు ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. ఈ వర్క్‌షాపు కొనసాగింపుగా త్వరలో హేక్ థన్ రూపంలో ఈ ఆలోచనలకు ఒక రూపం కల్పిస్తామని వారు తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థులకు అప్రెంటిస్ శిక్షణను ఇచ్చి జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఐవో సిఈవో ఎస్. కార్తీక్, ఎన్. శ్రీకాంత్ వారి సిబ్బందితో పాటు కళాశాల ఇన్నోవేషన్ సెల్ ఇంచార్జిలు ఎన్. శ్రీనివాస రావు, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ మెర్లిన్ లిండా, డాక్టర్ సుధీర్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివ ప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, టిపివో ఎస్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒలంపియాడ్‌లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్టులో త్రివేణి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఎ. మనస్వి తేజ, ఎ నందన్, స్టేట్ మ్యాథ్స్ ఒలంపియాడ్ మెరీట్ అవార్డులను గెలుచుకున్నారు. అదేవిధంగా ఎ. మనస్వీ తేజ, ఎం. రిషివేంద్ర మెరీట్ అవార్డు గెలుచుకున్నారు. క్రియేటివ్ పెయింటింగ్ ఒలంపియాడ్ ఐబివో స్టేట్ మెరీట్ అవార్డులను విద్యార్థులు ఎం. నిఖిత, సాయి ధీరజ్, కె. జగదీష్, ఎ. ప్రణయ్, కెఇ శాశ్రీ, వై. రుషిక, ఎన్. నికితలు పొందారు. ఎ. మనోజ్ తేజ, వైష్ణవి, బి. లోకేష్, ఎ. నందన్, కె. యశ్వంత్, ఎం. నిఖిత, ఎం. కృష్ణతేజ, ఎం. రిషేంద్ర క్రియేటివ్ పెయింటింగ్ విభాగంలో ప్రతిభ చూపి అవార్డులు గెలుపొందారు.ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి పాఠశాల విద్యార్థులు మరిన్ని పోటీ పరీక్షల్లో పాల్గొని అవార్డులు పొంది పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో కాట్రాగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జి చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** గంజాయి కేసులో 20 ఏళ్లు జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పిన ఘటన సోమవారం ఖమ్మం కోర్టులో జరిగింది. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బొబ్బిలి సాయి, వెంకట సత్యనారాయణ, గుంజి వెంకట్రావు, గంధసిరి నాగరాజు లు గంజాయి తరలిస్తూ 2021 సెప్టెంబరు 29న ఖమ్మం రూరల్ పోలీసులకు కోదాడ క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 170 కేజీల 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఖమ్మం అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె. ఉమాదేవి 20 ఏళ్లు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వర్లు వాదించగా కోర్టు కానిస్టేబుల్ కె. తిరుమలరావు, లైజన్ ఆఫీసర్ భద్రునాయక్, శ్రీనివాసరావు, హోంగార్డ్ ఆయూబ్ లు కేసుకు సహకరించారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ట్రైని ఐపిఎస్,ఎస్‌హెచ్‌ఓ పి.మౌనిక సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందజేశారు.1) శంకరం(పెద్దతండా),2) రమేష్(వెంకటగిరి),3) లెనిన్(ఆరెంపుల)గ్రామాలకు చెందిన వారు ఫోన్లు పోగొట్టుకుని ఇటీవల ఐఎంఇ నెంబర్‌తో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసునమోదు చేసుకుని సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకున్నప్పుడు అందుకు సంబంధించిన బిల్లులను తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. పొరపాటున సెల్‌ఫోన్ పోయినప్పుడు ఐఎంఇ నెంబర్‌తో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రామారావు, కుసుమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎస్‌పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా చెరుకుపల్లి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని గుదిమల్ల గ్రామానికి చెందిన చెరుకుపల్లి నాగేశ్వరరావు బహుజన సమాజ్‌పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. సోమవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్‌మందా నియమించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావు మాట్లాడారు..తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యత తనకు మరింత బాధ్యతను పెచిందన్నారు. అందరిని కలుపుకు పోతూ బీఎస్‌పీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 20సంవత్సరాలు గా బహుజన విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్న తనను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిడంపై రాష్ట్ర పార్టీకి ధన్యవాదాలు తెలియజేశారు.

# నేడు బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



**ప్రజాపక్షం/ చింతకాని :** ప్రొద్దుటూరు శబరి కల్యాణ మండపం నందు మంగళవారం జరిగే బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా పరిషత్ ఛైర్మన్, పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు కోరారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో మాజీ ఎంపిపి పొనుగోటి రత్నాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్‌రాజు మాట్లాడుతూ త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రొద్దుటూరులో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మాధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొంటారని, నామా విజయానికి కార్యకర్తలకు దిశా నిర్ధేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ శ్రేణులు అధికసంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకటరామారవు, మాజీ ఎంపిపి రత్నాకర్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీను, షబ్బీర్ ఖాన్, కృష్ణ, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని మండలం రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలకు హైద్రాబాద్‌లోని నోష్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో రూ.1.84లక్షల విలువ చేసే కుర్చీలు, బల్లలు, గ్రీన్ బోర్డ్స్ తదితర కార్యాలయ ఫర్నిచర్‌ను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాలు మాధవిదేవికి సోమవారం అందచేశారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించినందుకు ఈ సందర్భంగా ల్యాబ్స్ ప్రతినిధులను గ్రామస్థులు అభినందించారు. ఈసందర్భంగా ల్యాబ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ మారుమూల పల్లెలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యంతో మేము పనిచేస్తున్నామని వారు ఈసందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ చౌడం కృష్ణవేణి, పాఠశాల హెచ్‌ఎం బీరవల్లి మాధవిదేవి, ఉపాధ్యాయులు సింహాద్రి, రమేష్, తిప్పారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కొమ్మినేని కృష్ణ, అలవాల వీరభద్రం తోట కర్ణ, గోపాల్, అలవాల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీపీపీఏ మండల అధ్యక్షుడిగా యాతాకుల



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీపీఏ) మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో నూతన కమిటిని ప్రకటించారు. మండల అధ్యక్షుడు గా యాతాకుల శ్రీనాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కె.వీరబాబు, ప్రధాన కార్యదర్శి గా భూక్యా సుధాకర్, ఉపాధ్యాక్షులుగా చిర్రా భాగ్యమ్మ, చేకూరి పుల్లయ్య, కోశాధికారి గా మల్లెల లాలు, జాయింట్ సెక్రటరీ గా చేకూరి జ్యోతి, చిలకల లింగయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా కమిటి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



**ప్రజాపక్షం /తల్లాడ :** పాఠశాల విద్యానంతరం విద్యార్థులు ఆసక్తి గల కోర్సుల్లో చేరి ఉజ్వల భవిష్యత్‌ను సాకారం చేసుకోవాలని, ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా స్థిరపడాలని ప్రముఖ విద్యావేత్త, కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ పుట్టా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు హెచ్ఎం ఝాన్సీరాణి అధ్యక్షతన జరిగిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి అనంతరం ఇంటర్మీడియేట్, పాలిటెక్నిక్, ఐటిఐ, అగ్రికల్చర్ కోర్సులు ఉన్నాయని, తమ తమ ఆసక్తులను బట్టి ఆయా కోర్సుల్లో చేరాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత ఆహార ధాన్యాల కొరత సమస్యను అధిగమించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తగా, పునరుత్పాదక వనరులను, శక్తులను తయారు చేయడానికి ఒక మంచి ఇంజనీర్‌గా, సైన్స్ రంగంలో కృషి చేసి ఒక మంచి వైద్యుడిగా అనేక రకాల మందులను తాయరు చేసే శాస్త్రవేత్తగా వివిధ ఆసక్తిగల కోర్సుల్లో రాణించి దేశ ప్రజలకు తమ విలువైన సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, కృష్ణార్జున్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు ఆర్‌డిఓగా అదనపు బాధ్యతలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు ఆర్డీఓ కే శ్రీనివాస్ సెలవు పై వెళ్లడంతో అదనపు బాధ్యతలుగా కలెక్టర్ గౌతమ్ అప్పగించినట్లు డి ఏ ఓ శ్రీనివాస్, డిటి వెంకటేశ్వరరావులు తెలిపారు. ఈ విషయమై కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. కల్లూరు ఆర్డీఓ మూడు నెలలు సెలవు పై వెళ్లడంతో అదనపు బాధ్యతలు తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం రఘునాథపాలెం గ్రామానికి చెందిన తిరుమలకొండ రాంబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, రెంటాల ప్రసాద్, గుడిపూడి రామారావు, బోయన వెంకటనర్సయ్య, తకెళ్లపాటి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. చిమ్మపూడి గ్రామానికి చెందిన గుండ్ల నారాయణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు జోనేబోయిన పాపయ్య, మారం కరుణాకర్‌రెడ్డి, సిపిఐ నాయకులు వెంకట రెడ్డి, దొంతు వెంకన్న, నర్సయ్య, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా రవికుమార్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెంః** మండలపరిధిలోని పిండిప్రోలు తిప్పారెడ్డిగూడెం హైదర్‌సాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు గ్రామాల్లో లైన్‌లో సబ్‌స్టేషన్ల మరమ్మత్తులలో భాగంగా పిండిప్రోలు, వెదుల్లచెరువు, తిమ్మక్కపేట,తాళ్ళచెరువు, తేట్టెలపాడు,గోపాలపురం, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, పడమటితండా మొదలగు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.రవికుమార్ తెలిపారు. కావున ఆ పరిధిలో ఉన్న గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరిస్తూ విద్యుత్తు అవసరం ఉన్నవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలింగ్ రోజున చేయాల్సిన విధులు, బాధ్యతలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పూర్తి అవగాహన కలగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పాలేరు, మధిర, సత్తుపల్లి సెగ్మెంట్ల, ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ ఆర్ కళాశాలలో ఖమ్మం, వైరా నియోజక వర్గ పివో, ఏపివో లకు శిక్షణ కార్యక్రమ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల, ఇవిఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన పొందాలని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లకు సీక్రెసి ఓటింగ్, పోలింగ్ నియమాలపై వివరించాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వారికి వివరించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరపాలని, మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలన్నారు. రిజల్ట్ చూసిన తర్వాత ఈవిఎం యంత్రాన్ని క్లియర్ చేయాలన్నారు. అనంతరం అసలైన పోలింగ్‌కు సన్నదం కావాలని సూచించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం పై అవగాహన ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకుని ఉండాలన్నారు. హ్యాండ్‌బుక్‌లో సూచించినవిధంగా మొత్తం పోలింగ్ సామాగ్రిని సేకరించుకోవాలన్నారు. ఫారములు, స్టాచ్యుటరీ, నాన్ స్టాచ్యుటరీ కవర్స్ మెటీరియల్స్, మాక్ పోల్ సర్టిఫికెట్ ఇచ్చే విధానంపై ఇవిఎం యంత్రాలలో క్లోజ్ రిజల్టు, క్లియర్ వ్యవస్థలపై వివి ప్యాట్ లో ఏడు సెకన్లలో వచ్చే స్లిప్స్ పై, పోలింగ్ జరిగే సందర్భంలో కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్, బ్యాలెట్ యూనిట్లలో ట్రబుల్ షూట్స్‌పై అవగాహన పొందాలన్నారు. ఓటింగ్ గోప్యత నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాలెట్ గోప్యతను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారం 7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాని పోలింగ్ స్టేషన్ బయట ప్రదర్శించాలన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడానికి బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్‌లోని సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారు ఫారం 12ఎ, ఫారం 12 ద్వారా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోస్టల్ బ్యాలెట్లు పొంది ఖచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటరు హెల్ప్ లైన్, సి విజిల్ యాప్ లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ఏవేని పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ఎన్నికల నిర్వహణ వంద శాతం విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. శిక్షణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఇవిఎం యంత్రాలతో హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఎస్డిసి ఎం రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలతో హైవే రోడ్డు ధ్వంసం..!

**- ఇబ్బందులు పడుతున్న ప్రజలు**



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పరిధిలోని పెద్ద కోరుకోండి నుంచి వెన్నవల్లి వెళ్తున్న రహదారి గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలతో రోడ్డు ధ్వంసం కావడం వల్ల రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి రహదారిలో అంతర్రాష్ట్ర ప్రయాణం వాహనాలు, బాటసారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలు గత సంవత్సరం నుంచి ఇదే రహదారిలో గుట్ట నుంచి మట్టి తోలకాలు చేస్తుండటంతో రోడ్డు ధ్వంసం కావడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. పెద్ద కోరుకొండి నుంచి గుట్ట వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల మేర ధ్వంసం కావడం వలన ఒళ్ళు గుల్ల తో ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుంది. దీంతోపాటు దుమ్ము ధూళి వలన కాలుష్యం కోరలతో పెద్ద కోరుకొండి వాసులు కష్టాలు పడుతున్నారు. శబ్ద కాలుష్యం, దుమ్ము ధూళి కాలుష్యం, నానా తంటా లు పడాల్సి వస్తుంది. శబ్ద కాలుష్యం, దుమ్ము ధూళి కాలుష్యంతో రాబోయే రోజుల్లో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. దుమ్మెత్తు పోస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలతో ఇబ్బందుల్లో పెద్ద కోరుకొండి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా అధికారులు ఆలోచించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇదే రహదారిలో ఆంధ్రాకు అనునిత్యం ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. దీనికి తోడు హైవే వాహనాలు ఏకం కావడంతో రోడ్డు వెంట ఉన్న గృహస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు.

## పువ్వాడ నగర్ కొత్త కాలనీ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పువ్వాడ ఉదయ్ నగర్ కొత్త కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, ప్లాట్లను ఆక్రమించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. సిపిఎం నేతలు సోమవారం పువ్వాడ ఉదయ్ నగర్ కొత్త కాలనీని సందర్శించారు. అక్కడి బాధితులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లు మాట్లాడుతూ సిపిఎం అనేక దఫాలుగా నిర్వహించిన పోరాట ఫలితంగానే పువ్వాడ నగర్‌లో ఖమ్మం నగరంలోని పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. 15 ఏళ్లు గడుస్తున్నా నేటికి సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పువ్వాడ ఉదయ్ కుమార్ నగర్ గ్రామ పంచాయతీ సమస్యలకు నిలయంగా మారిందన్నారు. కొంత మంది ముఠాగా ఏర్పడి స్థలాలు బలవంతంగా ఆక్రమించుకుని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఎస్‌కె సైదులు, కూచిపూడి నరేష్, నాగులమీరా, రాంబాబు, భాస్కర్, సుభాని, ఉస్మాన్, శ్రీను, పుష్పావతి, అన్వర్, రాందాస్, లక్ష్మణ్, సుభద్ర, వీరభద్రాచారి, నాగేంద్ర సింగ్, మహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటలాలయ్య సేవలు మరువలేనివి

**సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తనికెళ్ల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యాసా వెంకటలాలయ్య సేవలు మరువలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల లో సోమవారం సిపిఐ సీనియర్ నాయకుడు గ్రామ ప్రథమ సర్పంచ్ యాసా వెంకటలాలయ్య 34వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోటు ప్రసాద్ మాట్లాడుతు ఆనాడు దళితులు గ్రామానికి దూరంగా ఉండటంతో సిపిఐ పార్టీ వారిని గ్రామానికి దూరంగా కాకుండా గ్రామం మొత్తల్లోకి తేవాలని నిర్ణయించిందని అన్నారు. రాష్ట్రీయ ప్రధాన రహదారిప్రక్కన గల యాసా వెంకటలాలయ్య వ్యవసాయ భూమి మొత్తాన్ని దళితుల ఇండ్లస్థలాల కోసం ఇవ్వాలని పార్టీ తీర్మానం చేస్తే దానికి కట్టుబడి తన 12 ఎకరాల భూమిని పార్టీ నిర్ణయం మేరకు ఇచ్చినటువంటి గొప్పవ్యక్తి ఆయన అని అలాంటి మహనీయుడిని ఇప్పటికి మరిచిపోలేదని గుర్తు చేశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది పడుతున్న రోజుల్లో యాసా వెంకటలాలయ్య సొంతడబ్బుతో వడ్డెర కాలనీ , గౌడ్ బజార్ , గొల్లబజార్ , ఎస్సీకాలనీ లో బావులు తవ్వించి నీటి ఎద్దడిని తగ్గించిన మంచి మనిషి వెంకటలాలయ్య అని కొనియాడారు. నేటికి ఆయన వర్ధంతికి ఇంత మంది కులమతాలకు అతీతంగా హాజరయ్యారంటే ఆయనకు ప్రజల్లో ఇప్పటి ఉన్న గౌరం ఎంతో అర్థంచేసుకోవచ్చని పేర్కొన్నారు. దేశలో ప్రజాస్వామ్య విలువలు రోజురోజుకు దిగజారుతున్నాయని విమర్శించారు. అధికారంకోసం ఏరోజు ఏ నాయకుడు ఏపార్టీలో ఉంటాడో తెలియని రోజులని అన్నారు. తనికెళ్ల గ్రామాన్ని మళ్లీ పూర్వం రోజుల్లాగా తీసుకురావాలని దీనికోసం కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు , దొండపాటి రమేష్ , తోట రామాంజనేయులు , మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, నాయకులు కవిడ వీరభద్రం , గడల చిన్న సూర్యనారాయణ , పిన్నం పుల్లయ్య, ఎస్టీయు నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు , విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి , గాజుల వెంకటేశ్వరరావు , సిపిఎం నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు , చల్లా నారాయణ , యాసా వెంకటేశ్వర్లు , యాసా రవి , యాసా శివకృష్ణ , యాసా అన్వేష్ పార్టీ కార్యకర్తలు , సానుభూతిపరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఏపిఎం, వివి ప్యాట్ల వినియోగంపై పూర్తి అవగాహన కలిగుండాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా అన్నారు. సోమవారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, లక్ష్మీ దేవిపల్లి మండలం రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. విధులు నిర్వహించే సిబ్బంది ఫారం 12, ఫారం 12 ఏలను శిక్షణ నిర్వహించే కేంద్రాల్లో అందజేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అదే నియోజకవర్గంలో విధులు కేటాయిస్తే వారు ఈడిని తీసుకోవడం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం 12 ఏలను అందజేయాలని చెప్పారు. ఓటు ఉన్న పార్లమెంట్ ఉన్న నియోజకవర్గం కాకుండా మరొక నియోజకవర్గంలో విధులు కేటాయిస్తే అటువంటి వారు పోస్టల్ బ్యాలెంట్ వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు17 సి ద్వారా, రిజిష్టర్ ఆఫ్ ఓటర్ వివరాలు 17 ఏ ద్వారా అందజేయాలని సూచించారు. నిర్వహించిన మొదటి శిక్షణా కార్యక్రమానికి కొత్తగూడెం 277 మంది, అశ్వారావుపేటకు 282 మంది, ఇల్లందుకు 240 మంది, పినపాకకు 270 మంది, భద్రాచలంకు 210 మంది, మొత్తంగా 1279 మందికి గానూ 90 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. వారికి ఎన్నికల నిబంధనల ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏఆర్ఓ మధు, ఇల్లెందు ఏఆర్ఓ కాశయ్య, భూమి, కొలతల శాఖ ఏడి కుసుమ కుమారి, ఇరిగేషన్ ఇఇ అర్జున్ రావు, ఇల్లందు తహశిల్దార్ రవి కుమార్, కొత్తగూడెం తహశిల్దార్ పుల్లయ్య, సుజాతనగర్ తహశిల్దార్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గదుల్లో సెల్ ఫోన్లు..!

**-మారిన ఉపాధ్యాయుల తీరు**
**-నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు**



**ప్రజాపక్షం/కరకగూడెంః** మండల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల తీరు మారుతోంది. ఇంట్లో వారిని పిలిచే విధంగా విద్యార్థులను ఎందిరా.. ఏందే.. ఇటు రారా.. ఏయ్ అది తీసుకురావే... అంటూ కొంత మంది ఉపాధ్యాయులు స్కూల్లో ఉచ్చరించడం విస్మయానికి గురిచేస్తుంది. విద్యార్థుల పట్ల మర్యాదగా మాట్లాడాల్సిన గురువులే ఏందిరా.. ఏందే అంటూ మాట్లాడడం చర్చనీయాంశంగా మారుతుంది. తాజాగా మండలంలోని కొన్ని హైస్కూల్లో విద్యార్థి పట్ల మహిళా ఉపాధ్యాయులు ఏందిరా అని మాట్లాడడం ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. అంతేకాకుండా ఇళ్లల్లోకొచ్చు పిల్లలకు అవగాహన లేక పెద్దవాళ్లు, చిన్నవాళ్లు గౌరవం లేకుండా మాట్లాడుతున్నారు. ఉపాధ్యాయులకే గౌరవించడం తెలియదు. పిల్లలకు ఎలా తెలుస్తుందని కొంత మంది తల్లిదండ్రులు అంటున్నారు. ప్రచారం లేకపోలేదు. గురువులు క్రమ శిక్షణతో ఉంటేనే ఆ క్రమశిక్షణ విద్యార్థులకు అబ్బుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. దీనికి భిన్నంగా మండలంలో కొన్ని స్కూళ్లు పాఠశాలలో ఉండడం గమనించాల్సిన విషయం. పాఠాలు చెప్పే సమయంలో కొంతమంది సెల్ ఫోన్లు మాట్లాడుతున్నట్లు కూడా ఆరోపణలు, విమర్శలు వెలువెత్తుతున్నాయి. సెల్ ఫోన్ లోఏదైనా మెసేజ్ వస్తే.. విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు వెంటనే పాఠాలు ఆపేసి సెల్‌ఫోన్ వైపు అడుగులు వేయడం విమర్శలకు తావిస్తుంది. కొంత మంది ఉపాధ్యాయులు ఎక్కువ సమయాన్ని విద్యార్థులకు కేటాయించకుండా సెల్ ఫోన్‌కే కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. పాఠశాల నడిచే సమయంలో విద్యార్థిని విద్యార్థుల పై ఉపాధ్యాయులు వాడుతున్న "ఏందిరా.. ఏంద్దే" అన్న భాషప్తై విద్యాశాఖలోని ఒక అధికారిని ప్రశ్నించగా స్కూల్లో ఏందిరా.. ఏంది అనే భాషను వాడకూడదని అలా వాడుతుంటే విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా సంబంధిత అధికారులకు తెలియజేస్తామని అన్నారు. చేస్తే అట్టి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని చెప్పడం జరుగుతుంది. పాఠాలు జరిగే సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయడం సరైంది కాదని విద్యార్థి సంఘాల నాయకులు మండి పడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పాఠశాలలో ఉపాధ్యాయులు వాడుతున్న భాష సరికాదని పలువురు విరుచుకుపడుతున్నారు. ఉపాధ్యాయులు పద్ధతి మార్చుకోకుంటే అట్టి స్కూల్స్ ముందు పోరు తప్పదని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

## తాలిపేరు పూడిక తీత పనులు చేపట్టాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతాంగానికి ప్రధాన ఆయకట్టుగా సారునీరు అందించే తాలిపేరు ఎడం కాలువ పూడిక తీత పనులు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడిక తీత పనులు ఆగిపోవడం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. ప్రాజెక్టులో నీరున్నప్పటికీ కాలువమరమ్మత్తులు, పూడిక తీయకపోవడంతో నీరు వదలడం లేదని, తద్వారా ఆయకట్టు రైతాంగం తీవ్ర నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకుని రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల నాయకులు తెల్లం లక్ష్మీనారాయణ, ఐనవోలు పవన్ కుమార్, కారం కృష్ణమూర్తి, ఆకోజ్ సునీల్ కుమార్, సూరిబాబు, జగపతి పాల్గొన్నారు.

## చేపల మార్కెట్‌పై అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు చేపల మార్కెట్ పై మణుగూరు మున్సిపాలిటి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. చేపల మార్కెట్ నుండి ముక్కులు పగిలిపోయేలా వస్తున్న దుర్వాసన, కుళ్లిన చేపల వ్యర్థాల కారణంగా పురుగులు తదితర వాటితో అక్కడి పరిసర ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చేపల వ్యాపారులకు తగు సూచనలు చేయకపోవడంతో ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే చాలు మార్కెట్‌కు చుట్టు ప్రక్కల వారు దుర్వాసన తట్టుకోలేకపోతున్నారంటూ ఆరోపిస్తున్నారు. చేపల వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు తమ వ్యాపారం తప్ప పరిశుభ్రత గురించి పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. చేపల మార్కెట్ గురించి మర్చిపోయిన మణుగూరు మున్సిపాలిటీ అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరచి చేపల మార్కెట్‌పై దృష్టి పెట్టి వ్యాపారులకు తగు సూచనలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఓ ప్రాణాన్ని కాపాడిన పోలీసులు



**ప్రజాపక్షం/మణుగూరుః** బాంబే కాలనీ సమీపంలోని చంద్రబాబు నగర్ కు చెందిన 30 సంవత్సరాల గుగులోతు రవి అనే వ్యక్తి సోమవారం 100 కు డయల్ చేసి తాను ఆత్మహత్య చేసుకున్నా అని సమాచారం ఇచ్చాడు. ఆ సమాచారం మణుగూరు పట్టణంలోని పూలకోట సెంటర్లో బ్లూ కోట్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్, మరొక హోం గార్డ్ కృష్ణ వీర లు వెంటనే చంద్రబాబు నగర్ కు వెళ్లి తలుపులు బద్దలు కొట్టి ఉరి వేసుకొని అపస్మారక స్థితికి వెళ్తున్న వీర ప్రథమ చికిత్స నిర్వహించి ప్రాణాలను కాపాడారు. కృష్ణ వీరాలు చేసిన కృషికి డిఎస్పి రవీందర్ రెడ్డి, సిఐ సతీష్ కుమార్, ఎస్సై రాజేష్ లు వీరిద్దరిని అభినందించారు.

## బిజెపి, మిత్రపక్ష పార్టీలను ఓడించండి



**ప్రజాపక్షం/మణుగూరుః** దేశం అత్యంత ప్రమాదకర పరిస్థి తుల్లో ఉందని, మోడీ ఆధ్వర్యంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార శక్తులు అమలు చేస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలతో దేశానికి ముప్పు తలపెడుతున్నారని దేశ సంపదలను, వనరులను, అడవులను, భూములను కారు చౌకగా గుజరాత్ మిత్రులైన అంబానీ,ఆదానీలకు అప్పగిస్తు న్నారని వారికి బినామీగా వారికి మోడీ ఉన్నాడని రానున్న ఎన్నిక లలో బిజెపి దాని మిత్ర పక్షాలైన పార్టీలను ఓడించాలని సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంటరీ అభ్యర్థి మోకాళ్ళ మురళీ కృష్ణ అన్నారు. పార్లమెంటు ఎన్నికలలో సిపిఐ (ఎం.ఎల్) మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా కామ్రేడ్ మోకాళ్ళ మురళీకృష్ణ పోటీ చేస్తున్నారు. కామ్రేడ్ మురళీ కృష్ణ ను సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసి (యతీంద్ర కుమా ర్) పార్టీ బల పరుస్తుందని వారు తెలిపారు. మణుగూరు ఐఎఫ్‌టీయూ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్లసమా వేశంలో ఎంపి అభ్యర్థి మోకాళ్ల మురళీ కృష్ణ, సిపిఐ (ఎంఎల్) ఎన్‌డి రాష్ట్ర నాయకులు జే. సీతారా మయ్య, భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావులు ప్రసంగించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, విప్లవ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ మణుగూరు సబ్ డివిజన్ నాయకులు పెద్దగోని ఆదిలక్ష్మి , పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమా, ఆర్.లక్ష్మి , డివిజన్ అధ్యక్షులు కోడెం రాధ, వినోద, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు కొండలరావు, సాధనాల రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా నిలవాలి



**ఎంపి నామ నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తీగలబంజర గ్రామంలో ఎండిపోయిన పంటలను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్ల రాష్ట్రంలో సాగు , తాగునీటి ఇబ్బందులు తలెత్తి పంటలు ఎండిపోయి ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. గత పదేళ్లలో ఎన్నడు ఈ దుస్థితి లేదని అన్నారు. ఉన్న కాస్త సొమ్ముపెట్టుబడి పెట్టి మొక్కజొన్న పంట సాగు చేస్తే నీళ్లు అందక పంట ఎండిపోయిందని బాధిత రైతు భూక్యా శ్రీను దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు రైతు పక్షంగా ఉండి పోరాడతామని స్పష్టం చేశారు. ముందస్తు కార్యాచరణ లేకపోవడం వలనే ఈ దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఖమ్మం జిల్లా వాణిని లోకసభలో వినిపించి జిల్లా మరింత అభివృద్ధికి కృషి చేస్తామనని అన్నారు. ఇప్పటివరకు రాజకీయాలకు అతీతంగా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. నీళ్లు , పెండింగ్ నిధులు , ప్రాజెక్టుల కసం పెద్ద ఎత్తున పోరాటం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి కవిత , ముత్యాల సత్యనారాయణ , బాణాల వెంకటేశ్వరరావు , కట్టా కృష్ణార్జున్‌రావు , వనమా విశ్వేశ్వరరావు , డాక్టర్ కాపా మురళి , బోడేపూడి బాబు , పారుపల్లి రవి , విజయ్ , వీరన్న , పోగుల శ్రీను , బోడ పోతుల బాబు , దరిపల్లి రామారావు , భూక్యా మాన్సింగ్ , రవీందర్ , చిత్తారు సింహాద్రి యాదవ్ , మోరంపూడి ప్రసాద్ , చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి టౌన్:** కాకతీయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు జూనియర్ విద్యార్థులు కలసి ఘనంగా పెర్వేల్ డే సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రన్సిపాల్ మరియు కరస్పాండెంట్ కూసంపుడి మధుసూదన రావు హాజరై ప్రసంగించారు. విద్యార్ధులు తాము ఎంచుకున్న కోర్సులను ఇష్టపడి చదవాలన్నారు. అలా చదివి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. చాల మంది విద్యార్థులు తమ జీవితాలను మొబైల్ తోనే గడుపు తున్నారని బాధ పడ్డారు. అంతే గాక ప్రస్తుతం వ్యవసాయం ద్వారా ఏన్నో రకాలయిన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల పొల్యూషన్ విపరీతంగా పెరిగిందని, దీనిని తగ్గించాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఛైర్మన్ జి.వీరారెడ్డి, శ్రీనివాస రావు, ప్రవీణ్ రెడ్డి, ఎం.శ్రీధర్, కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు.

## బార్ అసోసియేషన్ ఎన్నిక టై

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం ఇద్దరు పోటీ పడకా చెరిసమానం ఓట్లు రావడం ఎన్నిక టై అయ్యింది. వివరాల ప్రకారం, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం దేవదానం, చైతన్య పోటీ పడ్డారు. మొత్తం 98 ఓట్లకు గానూ, దేవదానంకు 49 ఓట్లు, చైతన్యకు 49 తో ఓట్లు పోలయ్యాయి. దీంతో ఎన్నిక టై అయ్యింది. ఇంతులో భాగంగా ఇరు వ్యానల్లు ఏకతాటిపైకి వచ్చి పదని చెరిసగం పంచుకున్నాయి. మొదటి ఆరు నెలలు అధ్యక్షునిగా చైతన్య కొనసాగనుండగా, చివరి ఆరు నెలలు పాటు దేవదానం అధ్యక్షులుగా ఉంటారు.

## నవోదయ సీటు సాధించిన జస్వంత్

**ప్రజాపక్షం/కామేపల్లి:** నవోదయ 2023, 2024 నందు గీతాంజలి విద్యాలయం కామేపల్లి పాఠశాల నందు సీటు సాధించి ధరావత్ జస్వంత్ ప్రభంజనం సృష్టించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు జస్వంత్‌ను అభినందించారు.



## సిసి కెమెరాలతో నేరస్తులకు చెక్

**-ఏఎస్‌పి పారితోష్ పంకజ్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** సిసి కెమోరాల ఏర్పాటు ద్వారా నేరాలకు చెక్ పెట్టవచ్చని ఏఎస్‌పి పారితోష్ పంకజ్ అన్నారు. పట్టణ వ్యాపారులు, ఇండస్ట్రీయల్ వారు సిసి కెమోరాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అందించిన 32 కెమోరాలను పట్టణంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీటి ద్వారా నేరాల అదుపు సులువుగా మారుతుందని తెలిపారు. ప్రజలు కూడా వారి వారి ఇళ్లలో, వ్యాపార సముదాయాల వద్ద సిసి కెమోరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ సిసి కెమోరాల ఆవశ్యకతపై పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సఫలీకృతం అయ్యాయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై పివిఎస్ రావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథలో భారీ అవినీతి

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు దుమ్ముగూడెం మండలంలో భారీ అవినీతి చోటు చేసుకుందని మాజీ ఎంఎల్‌ఏ, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం భారీ దర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ మండలంలో 90 గ్రామాలకు నీరు అందడం లేదన్నారు. అయినప్పటికీ బిల్లులు చేసుకున్నారని, అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి భారీ అవినీతికి పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎంపిడిఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు నల్లపు దుర్గాప్రసాద్, చింతిర్యాల రవికుమార్, వాసిరెడ్డి సాంబశివరావు,పిలకా వెంకటరమణారెడ్డి,మురళీ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షల్లో బాలాజీ స్కూల్ ప్రతిభ



**ప్రజాపక్షం/కల్లూరు:** నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో 2024 25 విద్యా సంవత్సరానికి గాను పాలేరు నవోదయ పాఠశాలలో ప్రతి సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరంలో 90 మంది విద్యార్థులు హాజరు కాగా 11 మంది అర్హత సాధించినట్లు యాజమాన్యం వలసల బాలాజీ తెలిపారు. 11 మందిలో ఏడుగురు కల్లూరు మండలం కు చెందిన వారు మామిడాల శ్రీమాన్ దీపక్, మేకల అన్విత, గరిడేపల్లి నవ్య శ్రీ, తుమ్మలపల్లి క్షేత్రజ్ఞ, కుదురుపాక శ్రీ సాయి తేజస్ , రాజప్రోలు శ్రీ నరేష్, భూక్య సంజయ్ రాజ్, వీరు అర్హత సాధించడం పట్ల మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్ ఎంపీపీ రఘు, జెడ్పిటిసి అజయ్ కుమార్ పలువురు ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచులు ప్రముఖులు తల్లిదండ్రులు వారిని అభినందించారు.

## తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కల్లూరు:** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామంలో తుమ్మలను కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సమక్షంలో కలిశారు. కల్లూరు మండలం కు చెందిన ప్రముఖ నాయకులు, ప్రజా ప్రతినిధులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, దేవరపల్లి శ్రీనివాసరావు, ఉస్మాన్, బొబ్బన శ్రీనాథ్ ,ధారా రంగ, మర్సకట్ల బాలరాజు, మోహన్ నాయక్ లు కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు పార్టీగెలుపు కోసం కృషి చేయాలని ఆయన కోరారు. వ్యక్తిగతంగా పలకరింపులు చేసినట్లు , స్థానిక వివరాలను పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## కల్లూరులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఐకెపి సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు సోమవారం ప్రారంభించారు. మండల పరిధిలోని కొర్లగూడెం, ఎరబోయినపల్లి, కప్పల బంధం, బోడిమల్లె, చెన్నూరు, చంద్రు పట్ల, చిన్న కోరుకొండి, పోచవరం, నారాయణపురం, పేరువంచ, ముగ్గు వెంకటాపురం, లక్ష్మీ పురం, బత్తులపల్లిలలో ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారిని రూప మాట్లాడుతూ రబీ సీజన్లో మండలంలో వ్యవసాయ బోర్లు, చెరువులు, కుంటలు ఆయకట్టు పరిధిలో 2400 ఎకరాలు వరి పంట సాగు చేశారని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యంను అమ్మి అధిక ఆదాయంను పొందాలని కోరారు. దళారులు పాలు కాకుండా సమీపములలోని కొనుగోలు కేంద్రాలకు అమ్ముకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐకెపి ఏపీఎం వెంకట్రామారావు, సీసీలు, సొసైటీ సీఈవోలు మురళి, శ్రీను ,కృష్ణారావు, బాలకృష్ణ లు గ్రామస్తులు ప్రముఖులు పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతల పూడ్చివేత



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మెయిన్ ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న గుంతలను మేదరిటోని పూడిపించారు. ఇందులో భాగంగా స్థానిక సినిమా హాల్ సెంటర్ నందు కాంగ్రేస్ పార్టీ ఆఫీస్ ముందు అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆర్అండ్‌బి రోడ్డు మీద ఉన్న గుంతలను అధికారులతో మాట్లాడి దగ్గర ఉండి పూడ్చడం జరిగింది.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి బస్టాండ్ ఇన్ గెట్ సమీపంలో వేసవి కాలంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రమును సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికుల సౌకర్యార్థం వేసవిలో బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందించ దగిన విషయమన్నారు. స్వలాభం చూసుకోకుండా పరులకు ఎంతో కొంత సహాయం చేయాలని సంకల్పం ఉన్న బస్టాండ్ ఆటో యూనియన్ నాయకులు అభినందనీయులు అన్నారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఏప్రిల్ , మే నెలలో మినరల్ వాటర్ ను ప్రయాణికులకు ప్రతిరోజు అందించడం చాలా గొప్ప విషయమని ఆమె సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి ఐ త్రి రాంకుమార్, ఎస్ ఎం బాలస్వామి, బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ నాయకులు అంబోజు శ్రీనివాసరావు, ఎస్కే గుంషావలి, నందిపాటి రవి, జీవన్ రావు, బాజీ, మేకల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో మెరిసిన బ్రిలియంట్ ఆణిముత్యాలు







## -విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేసిన ఛైర్మన్ బిఎన్ఆర్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆనవాయితీగా వొస్తున్న నానుడి...అద్భుతాలు సృష్టించడం మాకు మేమే సాటి ప్రతి సంవత్సరం సారపాక కీర్తి కిరీటాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిన బ్రిలియంట్ విద్యార్థులు. ఆదివారం వెలువడిన జాతీయ స్థాయి నవోదయ ఫలితాలలో సీట్లు కె హితేంద్ర, కె నేత్ర నిఖిల్‌లు సాధించి చరిత్ర సృష్టించారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ బిఎన్ఆర్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అద్భుతమైన వాతావరణంలో అన్ని పోటీ పరీక్షలకు గాను విద్యార్థులకు ఏకగ్రాతతో కూడిన శిక్షణ ఇస్తూ పోటీ ప్రపంచంలో ఎటువంటి పోటీనైనా ఎదుర్కొనే విధంగా తీర్చిద్దదే బాధ్యత తీసుకొని చిన్న వయస్సు నుండే సమాజంలో విద్యా అవశ్యకాన్ని గుర్తించి పిల్లల భవిష్యత్తు సువర్ణ యుగం చేయడమే బ్రిలియంట్ ఆశయమని తెలిపారు. అంతే కాకుండా విద్యార్థులు సాధించిన ఈ విజయం ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని ముమ్ముందు బ్యాచ్‌లను కూడా ఇదే విధంగా శిక్షణతో సీట్లు సాధించే విధంగా తయారు చేయడానికి మా సంస్థ ఎప్పుడూ అహర్నిశలు కృషి చేస్తుందని, విద్యార్థుల ఆశలు చిగురించేలా తల్లిదండ్రులకు, విద్యార్థులు మిఠాయిలు పంచి అభినందించి, బహుమతులను అందజేశారు. అడ్మిషన్లు ప్రారంభించడం జరిగిందని, ఆసక్తి గల వారు ఫోన్ 8142652005కి సంప్రదించాలని కోరారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రగుంట డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయితీలో ఉన్నటువంటి వివిధ ప్రాంతాలలో పని చేస్తున్నటువంటి వలస కూలీల వద్దకు తన సిబ్బందితో వెళ్లి వేసవికాలంలో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో భాగంగా వేసవికాల సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయాలని, వీలైనంత వరకు మేడ ఉండే ప్రాంతాలలో పనులు కొనసాగేలా చూసుకోవాలని, నీరు ఎక్కువగా తీసుకోవాలని, తలకు తప్పని సరిగా కండువాలు కట్టుకొని ఎండ దెబ్బ నుంచి కాపాడుకోవాలని తెలిపారు. ఎక్కువగా ద్రవ రూపంలో ఉండే పదార్థాలు మాత్రమే తీసుకోవాలని కొన్ని సందర్భాలలో జ్వరం, వాంతులు, విరోచనాలు వంటివి వస్తే వెంటనే దగ్గరల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని, వైద్యుల సలహా మేరకే చికిత్సను పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిపిఎంవో వెంకటేశ్వర్లు, హెచ్ఎస్‌వో కృష్ణయ్య, హెచ్ఐఎఫ్ ప్రేమలత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



# తునికాకు సేకరణ వెంటనే చేపట్టాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** 2024 తునికాకు సీజన్‌లో వేలం కానీ యునిట్లను వెంటనే ప్రభుత్వమే చేపట్టి ఆకు సేకరణ చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్‌ఏ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్ అన్నారు. సోమవారం సిపిఐ ఎంఎల్ మాస్ లూన్ ములకలపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తునికాకు సీజన్‌లో ఆకు సేకరణ పనులు సకాలంలో చేపట్టి ఏజెన్సీ ప్రాంతం పేదలకు ముఖ్యంగా ఆదివాసీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. తునికాకు పెట్టుబడి ఖర్చు లేని సహజమైన సంపదని, దీనిని సేకరించడానికి కార్మికులు పడే కష్టం అంతా ఇంతా కాదని, ఒక్కో సారి ప్రాణాలు కోల్పోతున్నారని, తునికాకు సేకరణకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం కృషి చేస్తే లక్షల మంది పేదలు ఉపాధి పొందుతారని, దీనికి ప్రభుత్వానికి పైసా ఖర్చు వుండదని, అయితే ప్రభుత్వం వేలం పాటలు సహకాలంలో నిర్వహించి నడిపించడంలో విఫలం అవుతుందన్నారు. ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇచ్చి 2024 తునికాకు సీజన్ నడిపించాలని పెరిగే ధరలు, పడే కష్టం దృష్టిలో ఉంచుకుని 50 ఆకుల కట్టకు రూ 5 ధర నిర్ణయించాలని, వేలం పాటలు కానీ యూనిట్లను ప్రభుత్వమే నడిపించి పేదలకు ఉపాధి కల్పించాలని ఏజెన్సీ ప్రాంతంలో అవసరమైన ప్రాంతాల్లో ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, కొత్తగూడెం, భద్రాచలం వంటి ప్రాంతాల్లో బీడీ కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ ములకలపల్లి మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని గుంపెన సహకార సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. అన్నపురెడ్డిపల్లి, తెలిజర్ల, అబ్బుగూడెం, నామవరం, ఊటుపల్లి, గుంపెన గ్రామాలలో ఉన్నటువంటి రైతులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ అధికారి ప్రశాంత్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే అటువంటి రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను అనుగుణంగా తయారు చేసుకొని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఈ వ్యర్థాలు లేకుండా మట్టి పెళ్ళలు రాళ్లు ఇతర తిండి గింజలు పక్వానికి రాని గింజలు దెబ్బతిన్న రంగు మారినా మొలకేత్తినటువంటి గింజలు, మిశ్రమ, తక్కువ గ్రేడ్ కలిగిన గింజలు, తేమశాతం సరిగా కొలతల ప్రకారం మాత్రమే ఉండే విధంగా సరి చూసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వేసుకొని గిట్టుబాటు ధరలు పొందాలని సకాలంలో రైతులందరూ ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయిస్తూ మంచి లాభాలను పొందాలని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో గుంపెన సహకార సంఘం కార్యాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధార్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏడిఏ తాతారావు ప్రారంభించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ నందు మండల పరిధిలోని మోరంపల్లిబంజర్, సోంపల్లి, లక్ష్మీ పురం, కృష్ణ సాగర్, ఇరవెండిలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏడిఏ తాతారావు మాట్లాడుతూ బూర్గంపాడు, నాగినేనిప్రోలురెడ్డి పాలెం, సంజీవరెడ్డిపాలెం గ్రామాల రైతులు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ నందు వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని, మిగతా గ్రామాల రైతులు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. రైతులు తమ వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలను తీసుకొని వచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 సెక్రటరీ నిర్మల, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో బివి ప్రసాద్, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# గాంధీకి పరామర్శ

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత 10 రోజుల నుండి విపరీతమైన జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి బట్టా విజయ్ గాంధీని ఆళ్లపల్లి, గుండాల కాంగ్రెస్ కమిటీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా గాంధీ ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఆళ్లపల్లి, గుండాల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాయం రామనరసయ్య, కొడెం ముత్యమాచారి, సీనియర్ నాయకులు పొంబోయిన ముత్తయ్య, తదితరులు ఉన్నారు.



# చెక్ పోస్టుల్లో నగదు పట్టివేత

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా రూ లక్ష 20వేల నగదును పట్టుకున్నారు. చెక్‌పోస్ట్ ఇన్‌చార్జ్ పృథ్వీ ఈ నగదు మొత్తాన్ని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగభిక్షంకు అందజేశారు. కాగా పట్టుబడిన నగదు వివి ఫ్యాషన్స్ యాజమాని శశివకుమార్ భద్రాచలంకు చెందిన వ్యక్తిని ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఈ నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.



# పంటల పరిశీలన

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు అనే శీర్షికతో ఆదివారం పలు దినపత్రికతో వచ్చిన వార్తకు సోమవారం అధికారులు స్పందించి పంటలను పరిశీలించారు. వసుధ వన్ సిక్స్ వన్ ఆడ మగ మొక్కజొన్న విత్తనాలతో పంటలు సాగు చేసిన రైతులకు దిగుబడి రాక చేను ఎదగక ఎకరానికి రూ 30నుంచి 40వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయామని అధికారుల ముందు రైతులు వెల్లబుచ్చారు. నష్టపోయిన మాకు నష్టపరిహారం అందించాలని వసుధ 161 కంపెనీ యాజమాన్యంతో మాకు నష్టపరిహారం అందించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు వేడుకున్నారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మోకాళ్ళ శేఖర్ నకిలీ విత్తనాలు ఇచ్చిన సదర్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఈవో వంశీ, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు మోకాళ్ళ శేఖర్, రైతులు కొమ్మ శ్రీను, నాతి దుర్గేష్, పరమ రమేష్, బట్టు సురేష్, గుండెబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.



# కోటయ్య మృతి పట్ల పలువురి నివాళి

**ప్రజాపక్షం /మధిర :** మధిర పట్టణానికి చెందిన సీనియర్ ఎలక్ట్రిషియన్ రెంటపల్లి కోటయ్య(65) అకాల మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. సోమవారం మధిరలోని నివాసం వద్ద మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటయ్య మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోన ధనికుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హన్మంతరావు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, నిడమానూరి వంశీకృష్ణ, దుంపా వెంకటేశ్వరరెడ్డి, షేక్.జహంగీర్, బుల్లెద్దు, రాజేంద్ర, ఆదిమూలం శ్రీనివాసరావు, రామారావు సిద్ధంశెట్టి సందీప్ తదితరులు నివాళులర్పించారు.

